అసత్య ప్రకటనలు మానుకోవాలి

జగిత్యాల, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, పెగడపల్లి సింగిల్‌విండో చైర్మన్ వోరుంటి రమణారావు అసత్య ప్రకటనలు మానుకోవాలని కాంగ్రెస్ పెగడపల్లి మండలాధ్యక్షుడు బుర్ర రాములు సూచించారు. సోమవారం ఆయన పెగడపల్లిలో విలేకరులతో మాట్లాడారు. దళిత నాయకుడైన విజయభాస్కర్‌ను నాలుగు రోజుల క్రితం రమణారావు కలంపేరుతో దూషించాడన్నారు. గతంలో సైతం రమణారావు ఫ్యాన్స్ ఆర్ఆర్ పేరిట సంస్థను ఏర్పాటు చేశారని, వారు దళితులపై దాడులు చేశారన్నారు. దళితులపై మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, రమణారావుకు ప్రేమ లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి రమణారావు వచ్చి కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులను దూషించారన్నారు. ఆ సమయంలో రమణరావును విజయభాస్కర్ అడ్డుకునేందుకు ప్రయత్నించగా, ఆయనను కులంపేరుతో దూషించాడన్నారు. ఈ క్రమంలో విజయభాస్కర్ ఫిర్యాదు మేరకు పోలీసులు రమణారావుపై కేసు నమోదు చేశారన్నారు. దూషిస్తే కేసు నమోదైతే.. కాంగ్రెస్ పార్టీలో చేరనందుకే తప్పుడు కేసులు పెట్టారని పత్రిక ప్రకటనలు చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీ నిబద్ధత కలిగిన పార్టీ అని, ఎవరిపైన కక్ష సాధింపు చర్యలు ఉండవన్నారు. రమణారావుకు ధైర్యం ఉంటే పెగడపల్లిలో బహిరంగ విచారణకు రావాలన్నారు. కులం పేరుతో దూషించలేదంటే రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ప్రమాణం చేయాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు సంది మల్లారెడ్డి, తడగొండ రాజు, ప్రధాన కార్యదర్శి చాట్ల విజయభాస్కర్, మాజీ సర్పంచులు గోలి మహేందర్‌రెడ్డి, ఇస్లావత్ రవినాయక్, మాజీ ఎంపీటీసీలు కడారి సుప్రియ తిరుపతి, పూసాల శోభ తిరుపతి, ఎలగొండ కృష్ణహరి, మందపల్లి అంజయ్య, యూత్ మండలాధ్యక్షులు పురుషోత్తం అనిల్‌గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు తడగొండ తిరుపతి, సింగిల్‌విండో డైరెక్టర్ తోట మల్లేశం, సేవాదళ్ అధ్యక్షులు వంశీధర్, బొడ్డు రమేశ్, శ్రీరాం అంజయ్య, సీనియర్ నాయకులు చెట్ల కిషన్, గర్వాంధ రమేశ్, ముదుగంటి పవన్‌రెడ్డి, దీకొండ మహేందర్, జలపతి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

జిల్లా వైద్యాధికారిగా ప్రమోద్

డీఎంఅండ్‌హెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించిన ప్రమోద్

జగిత్యాల అర్బన్, నవంబర్ 11 : జగిత్యాల జిల్లా వైద్యాధికారిగా ప్రమోద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జగిత్యాల డీఎంఅండ్‌హెచ్ఓ శ్రీధర్ హైద్రాబాద్ బదిలీపై వెళ్లగా, జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ సమీయుద్దీన్ జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారిగా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. తాజాగా పెద్దపెల్లి జిల్లా వైద్యాధికారిగా విధులు నిర్వర్తిస్తున్న ప్రమోద్‌ను జగిత్యాల డీఎంఅండ్‌హెచ్‌వోగా బదిలీ చేయగా, సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు.

కోటిలింగాలలో గోదావరికి హారతినిస్తున్న పండితులు

ఆలయాల్లో కార్తీక పూజలు

మారుతీనగర్, నవంబర్ 11 : మెట్‌పల్లి పట్టణంలోని శివాలయాల్లో సోమవారం కార్తీక శోభ కనిపించింది. శివాలయాల్లో భక్తులు శివలింగాన్ని పంచామృతాభిషేకాలు తదితర ప్రత్యేకపూజలు చేశారు. కాగా, మహిళలు భక్తి శ్రద్ధలతో ఆలయ ఆవరణలో దీపాలను వెలిగించారు.

వెల్గటూర్, నవంబర్11: కార్తీక సోమవారం సందర్భంగా కోటిలింగాల భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గోదావరిలో స్నానాలాచరించారు. అనంతరం స్వామివారిని దర్శించుకొని, చల్లంగా చూడాలని వేడుకుకున్నారు. మొక్కులు చెల్లించుకున్నారు.

'దిశ' కుదిరేనా.. దశ మారేనా?

- మూడేండ్లుగా జరగని దిశ మీటింగ్‌లు
- కేంద్ర ప్రభుత్వ పథకాలపై కానరాని సమీక్షలు
- సమావేశాలపై దృష్టి సారించని ఎంపీలు
- ఈసారైనా జరిగేనా అని అనుమానాలు!
- ఎంపీల బాధ్యతారాహిత్యానికి నిదర్శనమంటున్న జనం

జగిత్యాల, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): 'అభివృద్ధి, సంక్షేమం మా ధ్యేయం.. రాష్ట్రాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అనేక నిధులు మంజూరు చేస్తోంది. కేంద్రం వల్లే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతున్నది.. సంక్షేమ పథకాలు అన్నీ మావే' అంటూ నిరంతరం మాటలు చెప్పే జాతీయ స్థాయి ప్రజాప్రతినిధులు.. వాస్తవంగా క్షేత్రస్థాయిలో మాత్రం అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, లోటుపాట్లపై దృష్టి కేంద్రీకరించడం లేదు. కేంద్రం అమలు చేస్తున్న పథకాలు క్షేత్రస్థాయిలో ఏ విధంగా అమలవుతున్నాయి? ప్రజలకు ఎంతగా చేరువవుతున్నాయి? వాటిని మరింత మెరుగ్గా ప్రజలకు అందించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి? అన్న విషయంలో కనీసం సమీక్షా సమావేశాలు సైతం నిర్వహించే స్థితిలో లేకపోవడంపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతుండగా, అధికారుల్లో నిర్లిప్తత ఆవహిస్తున్నది. కేంద్ర పథకాల సమీక్ష కోసం జిల్లా స్థాయిలో ప్రతి మూడు నెలలకు ఒకసారి లోక్‌సభ సభ్యుడి అధ్యక్షతన నిర్వహించాల్సిన దిశ సమీక్షా సమావేశం మూడేండ్లుగా జగిత్యాల జిల్లా పరిధిలో జరగక పోవడం తీవ్ర విమర్శలకు తావిస్తున్నది.

కేంద్ర పథకాల అమలుపై ప్రత్యేక కమిటీ

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు జిల్లా, మండల, పట్టణ, గ్రామ స్థాయిలో ఏ విధంగా అమలు అవుతున్నాయి, అన్న విషయాలను సమీక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం జిల్లా స్థాయిలో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. జిల్లా అభివృద్ధి, సమన్వయ, మానిటరింగ్ కమిటీ (దిశ) పేరిట రూపొందించిన ఈ కమిటీ ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్షా సమావేశం నిర్వహించాలని ఆదేశించింది. ఈ కమిటీకి లోక్‌సభ సభ్యుడు చైర్మన్‌గా వ్యవహరిస్తారు. జిల్లా పరిధిలో ఒకటి కంటే ఎక్కువగా లోక్‌సభ స్థానాలు ఉంటే, వాటికి ప్రాతినిధ్యం వహించే లోక్‌సభ సభ్యులను కో చైర్మన్లు, సభ్యులుగా ఉంటారు. కలెక్టర్ కమిటీ సెక్రెటరీగా వ్యవహరిస్తారు. జిల్లా పరిధిలో ప్రాతినిధ్యం వహించే రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మున్సిపల్ మేయర్లు, చైర్మన్లు, జడ్పీ చైర్మన్లు సభ్యులుగా ఉంటారు. అలాగే, చైర్మన్‌గా వ్యవహరించే ఎంపీ 9 మంది సభ్యులను నామినేట్ చేయొచ్చు. అందులో ఐదుగురు ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంధ సంస్థ సభ్యులు, ఇతరులను నమోదు చేయాలి.

45 అంశాలపై సమీక్షకు అవకాశం

ఈ కమిటీ ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశం నిర్వహించాలని నిబంధనలు చెబుతున్నాయి. ఇందులో కేంద్రం ప్రత్యక్షంగా అమలు చేస్తున్న పథకాలు, పరోక్షంగా రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి అమలు చేస్తున్న పథకాలపై సమీక్ష నిర్వహించాలి. దాదాపు 45 శాఖల పరిధిలో అమలవుతున్న పథకాలపై దిశ కమిటీ దృష్టి పెట్టాలి. వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో జాతీయ ఆరోగ్య మిషన్, కేసీఆర్ కిట్‌పై సమీక్ష నిర్వహించాలి. విద్యాశాఖ పరిధిలో సర్వశిక్ష అభియాన్, రాష్ట్రీయ మాధ్యమిక శిక్ష అభియాన్, మధ్యాహ్న భోజన పథకం, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పరిధిలో జాతీయ సామాజిక సహాయ పథకం, మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ, దీన్‌దయాల్ అంత్యోదయ యోజన, శ్యాంప్రసాద్ ముఖర్జీ జాతీయ రూర్బన్ మిషన్, దీన్‌దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన, వ్యవసాయ శాఖ పరిధిలో ప్రధానమంత్రి ఫసల్ యోజన, విత్తన, ఎరువుల సరఫరా, పంచాయతీరాజ్ శాఖ పరిధిలో ప్రధానమంత్రి సడక్ యోజన, ఎంపీ లాడ్స్, గృహ నిర్మాణశాఖ పరిధిలో ప్రధాన మంత్రి గ్రామీణ ఆవాస్ యోజన, పట్టణ ఆవాస్ యోజన, నీటి పారుదల శాఖ పరిధిలో ప్రధాన మంత్రి కృషి సంచయ్ యోజన, సమగ్ర వాటర్ షెడ్ నిర్వహణ, గ్రామీణ నీటి సరఫరా విభాగంలో జాతీయ గ్రామీణ తాగునీటి పథకం, మిషన్ భగీరథ, విద్యుత్‌శాఖ పరిధిలో దీన్‌దయాల్ గ్రామ జ్యోతి పథకం, ఉజ్వల్ డిస్కమ్ అస్యూరెన్స్, డిజిటల్ ఇండియా, స్వచ్ఛ్ భారత్, ప్రధానమంత్రి ఉజ్వల్ యోజన, ఎల్‌పీజీ గ్యాస్, జిల్లాలో రైల్వే లైన్‌ల అభివృద్ధి ఇలా అనేక పథకాలపై పూర్తిస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించాలి. జిల్లాలో ఏ పథకం ఏ స్థాయిలో అమలవుతోంది, అర్హుల లబ్ది కోసం తీసుకోవాల్సిన చర్యలు ఏంటి అన్న ప్రగతి నివేదికను, అమలు ప్రణాళికలను రూపొందించాలి.

మూడేండ్లుగా జాడలేని దిశ మీటింగ్‌లు

దిశ సమీక్షా సమావేశం జగిత్యాల జిల్లాలో మూడేండ్లుగా పత్తా లేకుండా పోయింది. 2016 అక్టోబర్ 11న జగిత్యాల జిల్లాగా ఏర్పాటైంది. జిల్లా ఏర్పడ్డ తర్వాత అప్పటి నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత చైర్‌పర్సన్‌గా, కరీంనగర్ ఎంపీ వినోద్ కుమార్, పెద్దపల్లి ఎంపీ బాల్క సుమన్ సభ్యులుగా దిశ కమిటీని రూపొందించారు. కవిత ఎంపీగా కొనసాగినంత కాలం జగిత్యాల జిల్లా పరిధిలో దిశ సమీక్షా సమావేశాలు క్రమం తప్పకుండా జరుగుతూ వచ్చాయి. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో నిజామాబాద్ ఎంపీగా ధర్మపురి అర్వింద్, కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌కుమార్, పెద్దపల్లి ఎంపీగా వెంకటేశ్ నేతకాని ఎంపికయ్యారు. జిల్లాలో నాలుగు మండలాలకు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ జగిత్యాల జిల్లా దిశ కమిటీ చైర్మన్‌గా, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ కో చైర్మన్‌గా దిశ కమిటీ ఏర్పాటైంది. అయితే, 2020 నుంచి కరోనా విజృంభించడంతో దిశ కమిటీ సమావేశాలు నిర్వహించలేదు. 2021 జూన్ మాసం నుంచి కరోనా తగ్గుముఖం పట్టడంతో సమావేశాలకు ఏర్పాట్లు జరిగాయి. 2021 జూలై 17వ తేదీన బండి సంజయ్‌కుమార్ అధ్యక్షతన దిశ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆ తరువాత నుంచి దిశ సమీక్ష సమావేశాల నిర్వహణ నిలిచిపోయింది. పలుమార్లు సమావేశానికి ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చిన బండి సంజయ్ సమీక్షా సమావేశం నిర్వహించే సమయంలో దాన్ని వాయిదా వేస్తూ వచ్చారు. దీంతో పథకాలపై సమీక్షా అనేదే లేకుండా పోయింది.

ఈ దఫాలోనైనా జరిగేనా?

2019 నుంచి 2024 మధ్య ఐదేండ్ల కాలంలో ఒకే ఒక్కసారి జగిత్యాల జిల్లాలో దిశ సమీక్ష సమావేశాన్ని నిర్వహించిన ఎంపీలు ఈసారైనా దిశ సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తారా? అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, గత ఐదేండ్ల అనుభావాల నేపథ్యంలో ఈ దఫా సైతం సమావేశాల నిర్వహణపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈసారి జగిత్యాల దిశ కమిటీ చైర్మన్‌గా నిజామాబాద్ లోక్‌సభ సభ్యుడు ధర్మపురి అర్వింద్‌ను ఎంపిక చేసినట్లు సమాచారం. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, పెద్దపల్లి ఎంపీని సభ్యులుగా నియమించినట్లు తెలుస్తోంది. అయితే, ఎంపీగా ఎన్నికై ఆరు నెలలు గడిచినా ఇంకా 9 మంది సభ్యులను దిశ కమిటీకి చైర్‌పర్సన్ నామినేట్ చేయనట్లు తెలుస్తోంది. కీలకమైన ప్రజాప్రతినిధి హోదాలో ఉన్న ప్రజాప్రతినిధులు ఇంకా పథకాల అమలుపై సమీక్షలు నిర్వహించి, అర్థవంత అమలుకు ప్రణాళికలు రూపొందించకపోవడంపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం అధీనంలో ఉన్న విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం, రైల్వేలైన్ ఏర్పాటు, ప్రధానమంత్రి సడక్ యోజన, సర్వశిక్ష అభియాన్, ఎల్‌పీజీ గ్యాస్, ప్రధానమంత్రి ఆవాజ్ యోజన, ప్రధానమంత్రి ఫసల్ యోజన పథకాలపై సమీక్ష నిర్వహించి వాటిని పకడ్బందీగా అమలు చేయాల్సిన తరుణంలో వాటిపై ప్రజాప్రతినిధులు శీతకన్ను వేయడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎంపీలు సమీక్షా సమావేశాలు నిర్వహించి పథకాలు సమర్థవంతంగా అమలు జరిగేలా చూడాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

సర్వే పక్కాగా నిర్వహించాలి : కలెక్టర్

సారంగాపూర్ : వివరాలు తెలుకుంటున్న కలెక్టర్ సత్యప్రసాద్

రాయికల్, నవంబర్ 11 : జిల్లాలో నిర్వహిస్తున్న కుటుంబ సర్వేలో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ బీ సత్య ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని అలూరు గ్రామంలో నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను కలెక్టర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు సర్వే చేస్తున్న తీరును పరిశీలించారు. స్వయంగా సర్వే ప్రశ్నాపత్రాన్ని వివరాలను నమోదు చేశారు. అనంతరం తాట్లవాయి గ్రామంలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని వెంట వెంటనే కొనుగోలు చేసి, మిల్లులకు పంపించాలని అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, డీఆర్డీవో రఘు వరుణ్, తహసీల్దార్ ఎండీ ఖయ్యూం, ఎంపీడీవో చిరంజీవి, అధికారులు పాల్గొన్నారు.

జగిత్యాల, నవంబర్ 11 : జిల్లాలో సర్వేలో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ బీ సత్యప్ర సాద్ ఆదేశించారు. సోమవారం జగిత్యాల పట్టణంలో హౌసింగ్ బోర్డ్, రవీంద్రనాథ్ ఠాగూర్, కాలనీలో, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్వే చేస్తున్న తీరును పరిశీలించారు. ఆర్డీవో మధుసూదన్, డీఆర్డీవో రఘు వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్, నవంబర్ 11: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో ఎన్యూమరేటర్లు ఇంటింటా సర్వే వివరాలు నమోదు చేశారు. మండలంలోని పెంబట్ల, కోనాపూర్, లక్ష్మీదేవిపల్లి గ్రామాల్లో చేపడుతున్న సర్వేను కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రఘువరణ్, ఆర్డీవో మధుసూధన్, ఎంపీడీవోలు చౌడారపు గంగాధర్, లచ్చాలు, తహసీల్దార్లు జమీర్, ముంతాజొద్దీన్, ఎంపీవో శశికుమార్ రెడ్డి, ఆయా శాఖల అధికారులు, ఎన్యూమరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

హౌసింగ్ బోర్డులో చోరీ

జగిత్యాల కలెక్టరేట్, నవంబర్ 11 : జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని ఓ ఇంట్లోకి చొరబడ్డ దొంగలు రూ. 1.80 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. జగిత్యాల టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన సుంచు సురేశ్ బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి హాజరయ్యేందు ఆదివారం ఇంటికి తాళం వేసి, కుటుంబంతో సహా బంధువుల ఇంటికి వెళ్లాడు. సోమవారం ఉదయం తిరిగి ఇంటికి వచ్చి చూడగా, ఇంటికి వేసి ఉన్న తాళాలు పగులగొట్టి, ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడేసి ఉన్న విషయాన్ని తెలుసుకొని వెంటనే జగిత్యాల టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు చోరీ జరిగిన విధానాన్ని పరిశీలించి, వివరాలు నమోదు చేసుకున్నారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించారు. ఆదివారం రాత్రి ఇంట్లోకి చొరబడ్డ దొంగలు బీరువా తెరిచి అందులో ఉన్న రూ. 1,80,000 ఎత్తుకెళ్లరని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని.. దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కొత్త బస్టాండ్‌లో

కొత్త బస్టాండ్‌లో చోరీ చేస్తుండగా ఓ మహిళను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. కొత్త బస్టాండ్‌లో ప్రయాణికురాలిగా నటిస్తూ ఓ మహిళ సంచి నుంచి నగదు చోరీ చేస్తుండగా, గమనించిన సదరు బాధిత మహిళ అప్రమత్తమై తోటి ప్రయాణికుల సాయంతో ఆమెను పట్టుకున్నారు. పోలీసులు ఆమెను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

విదర్భలో విజేతదే మహా పీఠం

- ఇక్కడ 62 అసెంబ్లీ నియోజకవర్గాలు
- ఈ ప్రాంతంలో పట్టు సాధిస్తే అధికారం పక్కా
- ప్రత్యేక దృష్టి సారించిన రెండు కూటములు

ముంబై, నవంబర్ 11(నమస్తే తెలంగాణ): మహారాష్ట్ర ఎన్నికలు సమీపిస్తున్న వేళ రెండు కూటములు విదర్భ ప్రాంతంపై ప్రత్యేకంగా దృష్టి సారించాయి. 62 నియోజకవర్గాలు ఉన్న విదర్భలో పాగా వేస్తే అధికారానికి దగ్గరైనట్టే అని కూటములు లెక్కలు వేసుకుంటున్నాయి. ఇక్కడి ప్రజలను ఆకర్షించి మెజార్టీ సీట్లు తమ ఖాతాలో వేసుకోవాలని తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ఇప్పటికే రెండు కూటముల నుంచి అగ్రనేతలు విదర్భ మొత్తాన్ని చుడుతూ ప్రచారం చేస్తున్నారు. ఎక్కువగా పత్తి పండించే రైతులు ఉన్న ఈ ప్రాంతంలో రైతులు ఎటువైపు నిలుస్తారనేది గెలుపోటములను నిర్ణయించనుంది.

రెండు కూటములకూ కీలకం

విదర్భలోని మొత్తం 62 స్థానాల్లో బీజేపీ, కాంగ్రెస్ 36 స్థానాల్లో ప్రత్యక్షంగా తలపడుతున్నాయి. 11 జిల్లాలు కలిగిన విదర్భ ప్రాంతం 1990ల వరకు కాంగ్రెస్‌కు కంచుకోట. మూడు దశాబ్దాలుగా ఇక్కడ బీజేపీ – శివసేన కూటమి పట్టు పెంచుకుంది. 2014లో ఇక్కడ బీజేపీ ఒంటరిగా పోటీ చేసి 44 స్థానాలను గెలుచుకుంది. 2019లో 29 స్థానాలకు పడిపోయింది. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ) ఇక్కడ మంచి ఫలితాలను సాధించింది. విదర్భలోని 10 లోక్‌సభ స్థానాల్లో ఏడు స్థానాలను కైవసం చేసుకుంది. దీంతో అసెంబ్లీ ఎన్నికల్లో విదర్భలో పాగా వేసేందుకు ఎంవీఏ ప్రయత్నిస్తున్నది. ఆరెస్సెస్ కేంద్ర కార్యాలయం విదర్భలోనే నెలకొని ఉండటం, రాష్ట్ర బీజేపీకి జోడుగుర్రాల్లాంటి దేవేంద్ర ఫడ్నవీస్, చంద్రశేఖర్ బవాంకులే ఈ ప్రాంతానికి చెందిన వారే కావడంతో బీజేపీ ఈసారి విదర్భ ప్రాంతాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నది.

మేఘాల్లోనూ మైక్రోప్లాస్టిక్

- పర్యావరణాన్ని ప్రభావితం చేస్తుందొచ్చు
- శాస్త్రవేత్తల ఆందోళన

న్యూఢిల్లీ: భూమిని మొత్తం ఆక్రమించేసిన మైక్రోప్లాస్టిక్స్ మేఘాల్లోకీ చేరాయని, ఇవి పర్యావరణాన్ని సైతం ప్రభావితం చేస్తుండొచ్చని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు సంబంధించి అమెరికాలోని పెన్సిల్వేనియా స్టేట్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు చేసిన ఓ అధ్యయనంలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆకాశంలో మైక్రోప్లాస్టిక్‌లు మంచు కేంద్రక రేణువులుగా పని చేసి అసహజంగా మేఘాల ఏర్పాటుకు కారణమవుతున్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. సాధారణంగా మేఘాలు ఏర్పడే పరిస్థితులు లేకపోయినా మైక్రోప్లాస్టిక్‌లు మేఘాలు ఏర్పడేలా చేస్తాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని నిర్ధారించడం కోసం పరిశోధకులు నాలుగు రకాల మైక్రోప్లాస్టిక్‌లను ప్రయోగశాలలో పరీక్షించారు. ఇందుకోసం నీటి బిందువులను చల్లబరిచి మంచుగా మార్చారు. మైక్రోప్లాస్టిక్ లేని నీటి బిందువులు మైనస్ 38 డిగ్రీల సెల్సియస్ వద్ద గడ్డ కట్టగా, 50 శాతం మైక్రో ప్లాస్టిక్‌లతో కలుషితమైన నీటి బిందువులు మైనస్ 22 డిగ్రీల సెల్సియస్ వద్దనే గడ్డ కడుతున్నట్టు తెలుసుకున్నారు. కాబట్టి మైక్రో ప్లాస్టిక్‌లు మేఘాల నిర్మాణాన్ని ప్రభావితం చేస్తున్నాయని అర్థమవుతున్నదని శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఫ్రీడ్‌మన్ తెలిపారు.

ఇజ్రాయెల్‌పై హెజ్బొల్లా రాకెట్ల వర్షం

90కి పైగా క్షిపణుల ప్రయోగం • పలువురికి గాయాలు • ధ్వంసమైన వాహనాలు

బీరుట్, నవంబర్ 11: ఇజ్రాయెల్–హెజ్బొల్లా మధ్య పోరు మరింత తీవ్రరూపం దాల్చింది. లెబనాన్‌లోని హెజ్బొల్లా గ్రూప్ సోమవారం ఇజ్రాయెల్‌పై వరుస రాకెట్ దాడులతో విరుచుకుపడింది. ఇజ్రాయెల్ నగరం 'హైఫా' లక్ష్యంగా 90కిపైగా క్షిపణులను ప్రయోగించింది. ఈ దాడుల్లో హైఫాలో పలు భవనాలు దెబ్బతిన్నాయని, పలువురు గాయపడ్డారని, వాహనాలు ధ్వంసమయ్యాయని మీడియా కథనాలు పేర్కొన్నాయి. హెజ్బొల్లా ప్రయోగించిన పలు మిస్సైల్స్‌ను ఇజ్రాయెల్ రక్షణ వ్యవస్థ 'ఐరన్ డోమ్' అడ్డుకున్నప్పటికీ, మరికొన్ని హైఫాలో పలు జనావాస ప్రాంతాల్ని తాకాయని తెలిసింది. ఒక చిన్నారి సహా నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారని ప్రాథమిక సమాచారం. హెజ్బొల్లా రాకెట్ దాడుల్ని ఇజ్రాయెల్ భద్రతా బలగాలు (ఐడీఎఫ్) ధ్రువీకరించాయి. హైఫా పట్టణం శివారు ప్రాంతాల్ని మిస్సైల్స్ తాకాయని ఐడీఎఫ్ పేర్కొన్నది.

హెజ్బొల్లా రాకెట్ దాడులతో ఇజ్రాయెల్‌లోని హైఫాలో దహనమవుతున్న కార్లు

శ్మశానం కింద హెజ్బొల్లా సొరంగం!

హెజ్బొల్లా సభ్యులు ఉపయోగించే సొరంగాలను ధ్వంసం చేసినట్టు ఇజ్రాయెల్ సైన్యం(ఐడీఎఫ్) ఆదివారం తెలిపింది. వీటిలో ఒకటి శ్మశానం కింద ఉందని ఆరోపించింది. కిలోమీటర్ పొడవున ఉండే ఈ సొరంగాలను గుర్తించామని ఎక్స్‌లో ఒక వీడియోను పోస్ట్ చేసింది. ఈ సొరంగాల్లో కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్స్, నిద్రించే గదులు, ఆయుధగారాలు ఉన్నట్టు ఐడీఎఫ్ వెల్లడించింది. ఓ సొరంగంలో డజన్ల కొద్దీ ఆయుధాలు, ఇతర సైనిక సామగ్రి ఉన్న వీడియోను ఎక్స్‌లో పోస్ట్ చేసింది. 'ఉగ్రవాదుల అండర్ గ్రౌండ్ సొరంగాలను మా దళాలు ధ్వంసం చేశాయి. అందులో వ్యూహాత్మకంగా శ్మశానం కింద కూడా ఒకటి ఉంది. హెజ్బొల్లా మనుషులు చనిపోయినా, బతికున్నా వారికి విలువ ఇవ్వదు' అని ఐడీఎఫ్ విమర్శించింది.

ఇరాన్ రసాయన ఆయుధాల అభివృద్ధి!

ఇజ్రాయెల్ సైనికులు, పౌరులపై ప్రయోగించేందుకు ఇరాన్ రసాయన ఆయుధాల్ని సిద్ధం చేసిందన్న వార్తలు వెలువడ్డాయి. ఔషధ తయారీలో రసాయన ఏజెంట్స్‌గా వాడే సింథటిక్ ఓపియాయిడ్లు, ఫెంటానేల్.. వంటి వాటితో ఇరాన్ రసాయన ఆయుధాల్ని అభివృద్ధి చేసిందని అమెరికా రక్షణ రంగ నిపుణుడు మాథ్యూ లెవిట్ వెల్లడించారు. శక్తివంతమైన రసాయన ఏజెంట్స్‌తో గ్రనెడ్లు, బాంబులను ఇరాన్ తయారుచేసిందని, వీటి ప్రభావానికి లోనైతే.. బాధితుల నాడీ వ్యవస్థ కొన్ని క్షణాల్లో దెబ్బతింటుందని తెలిపారు. ఇజ్రాయెల్ సైన్యం, పౌరులు లక్ష్యంగా ఈ రసాయన ఆయుధాల్ని ప్రయోగించేందుకు ఇరాన్ తయారు చేసిందని చెప్పారు. దీనిపై ఆయన రాసిన ఆర్టికల్ చర్చనీయాంశమైంది. ఇరాన్ రసాయన ఆయుధాల తయారీని తక్కువ అంచనా వేయడానికి వీల్లేదని హెచ్చరించారు. రసాయన ఆయుధాల నుంచి వెలువడే పొగను ఒకసారి పీల్చిగానే, బాధితులు వెంటనే స్పృహ కోల్పోతారని, ఇజ్రాయెల్ సైనికులు, పౌరులను బందీలుగా చేసుకోవడానికి ఇరాన్ వాడొచ్చునని చెప్పారు.

హారిస్‌ను అధ్యక్షురాలిని చేయాలి

బైడెన్ వైదొలగాలని డిమాండ్లు

వాషింగ్టన్, నవంబర్ 11: అధ్యక్ష ఎన్నికల్లో కమలా హారిస్ ఓటమి డెమొక్రటిక్ నేతల్ని తీవ్రంగా నిరాశపర్చింది. ఎన్నికల్లో ఓడిపోయినా.. కమలా హారిస్‌ను ప్రెసిడెంట్‌ను చేయవచ్చునని డెమొక్రటిక్ నేత ఒకరు వ్యాఖ్యానించారు. ట్రంప్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించేవరకు కమలాహారిస్‌కు పదవి అప్పగించాలని ఆమె మాజీ కమ్యునికేషన్స్ వ్యవహారాల డైరెక్టర్ జమాల్ సిమన్స్ బైడెన్‌కు సూచించారు. 'జో బైడెన్ గొప్ప అధ్యక్షుడు. అయితే ఆయన చేసిన వాగ్దానం.. నెరవేర్చాల్సి ఉంది. తన పదవికి రాజీనామా చేసి, కమలా హారిస్‌కు బాధ్యతలు అప్పగించాలి. తద్వారా అమెరికాకు తొలి మహిళా అధ్యక్షురాలిగా కమలా హారిస్ నిలుస్తారు' అని అన్నారు. అమెరికా రాజ్యాంగం ప్రకారం, కొత్త అధ్యక్షుడిగా ట్రంప్ వచ్చే ఏడాది జనవరిలో బాధ్యతలు స్వీక